

# వెలుగుబాట

**ఎమ్. హనుమంతరావు**

మిట్ట మధ్యాహ్నపువేళ

ఎండ నిప్పులు చెరుగుతున్నది. వడగాడ్పు కర్కపుటాల్ని కరిగించేస్తున్నది.

లింగమూర్తి గొడుగు ముడిచి, ఉస్సురను కుంటూ ఇంట్లోకి వచ్చాడు. వడగాలి దెబ్బకు అతని ముఖం బాగా వాడి, మాడి పోయింది. ముడతలుపడిన అతని ముఖం చిరుచెమటతో నిండిపోయింది. గొడుగు ఓ మూల పెట్టి, పైమీది కండువాతో ముఖాన్ని ఓసారి ఒత్తుకుని, ఆయాసంతో వాలుకుర్చీలో చేరబడ్డాడు.

"వెళ్లిన పని ఏమయ్యిందండీ?" ఆసక్తితో అడిగింది అతని భార్య వరలక్ష్మి.

> అన్యాయం, అధర్మం సహించే శక్తి లేకున్నా అలవరుచుకొనవచ్చు. మానవ నైజమని సరిపెట్టుకోనూవచ్చు. కాని నమ్మకద్రోహం? అందునా కన్నబిడ్డ చేత? త్రెంచుకొన్నా తెగని బంధం కదా?

లింగమూర్తి నిస్పృహతో నిట్టూర్చాడు. "ఏమవుతుంది, లక్ష్మీ! మనం ఏ కార్యం తలపెట్టినా, అది నిర్విఘ్నంగా కొనసాగుతుందని చెప్పలేకపోతున్నాం. అంత బాగున్నాయి మన రోజులు — పంతులుగారింటికి వెళ్లానా? అక్కడా చుక్కెదురయ్యింది..." ఉస్సురను కుంటూ అన్నాడు.

ఎంతో ఆశతో ఉన్న వరలక్ష్మి, మ్రాన్పడి పోయింది. ఆమెలోని దుఃఖం కట్ట త్రెంచుకుని ప్రవహించింది.

"ఇప్పుడేం చేస్తామండీ?" అంది నిరాశా భావంతో.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను, లక్ష్మీ! నాకు ఏమీ పాలుపోవడంలేదు. ఇప్పుడు మనం ఏదో విధంగా రెండువేల రూపాయిలు సంపాదించకపోతే అబ్బాయికి జైలునుండి విముక్తి ఉండదు. మనం కుమిలి కుమిలి ఏడవవలసిందే! పాపం వాడి విషయం ఆలోచించు. అకారణంగా తను శిక్ష అనుభవిస్తున్నందుకు.

వాడెంత తపన పడుతున్నాడో! ఏమిటో? నాకు నమ్మకం లేదు ఆ డబ్బు వీడే కాజేశా డని — అసలు వాడికి అటువంటి చెడుగుణా లవి లేనేలేవు చిన్నప్పట్నుంచి. కిట్టనివాళ్లూ, స్వార్థపరులూ, ఎవరో కాజేసి, అమాయకుడైన వీడిపై నేరం ఆరోపించి ఉంటారు..."

"అదే నా అభిప్రాయం కూడానండీ. ఇదంతా మన దురదృష్టమండీ. ఒక్కగా ఒక్క కొడుకు. వాడు ఇటువంటి నీచపుపని ఎప్పుడూ చేసి ఎరుగడు.. ఎవరో కిట్టని వాళ్లంటే సరిపోయిందా? ఎప్పుడైనా నేను డబ్బీలో పెట్టిన డబ్బులు చూసినా, అవి భద్రంగా తీసి ఇచ్చేసేవాడు. అటువంటి వాడిపై, ఇంత డబ్బు కాజేశాడన్న నేరాన్ని ఆరోపించడానికి వాళ్లకి నోరెలా వచ్చిందో? ఇదంతా తలుచుకుంటేనే, నా గుండెలు తరుక్కు పోతున్నాయి" అంది వరలక్ష్మి బాధగా.

"సరే. అది ఎలామూ ఉన్న బాధే! ప్రస్తుతం మన కర్తవ్యం — వాణ్ణి విడుదల చెయ్యడానికి ప్రయత్నించడం! లేకపోతే, వాడు మరీ బాధపడతాడు. అసలే తప్పులేని శిక్ష అనుభవిస్తున్నాడాయె! ఇంక ఈ మన క్షోభ ఎందుకు?... ఆ... ఒక్కటే మార్గం అగుపి స్తోంది. సాంబమూర్తి లేడూ? అతని దగ్గరి కైనా వెళ్లి అడిగితే, ఫలితం ఉండవచ్చు ననిపిస్తోంది. అతనికి సిరిమంత్రపు సిరి రావడంవల్ల విర్రవీగుతూ ఉంటాడన్న ఉద్దే శంతో అతని దగ్గరికి వెళ్లడానికి మొదట్లో సంకోచించాను. కాని, ఇప్పుడు మరో మార్గం కనిపించడంలేదు. వసుదేవుడంతటివాడే గాడిద కాళ్లు పట్టుకున్నాట్ట. ఇక మనమనగా ఎంత? సమయం వస్తే అందరమూ అంతే!"

"ఈ విషమ సమయాల్లో, అవన్నీ ఆలో చిస్తే ఎట్లాగండీ? వెళ్లి అడగండి...అవసర మైతే, నోటు రాస్తామనికూడా చెప్పండి."

"పిచ్చిదానా! నోటు రాసుకోకుండా, సాంబ మూర్తేకాదు — ఎవ్వరూ అంత డబ్బివ్వరు."

"ఎలాగైతేనేం లెండి — ప్రస్తుతం మనకి కావల్సింది డబ్బు..."

"అదేమరి! సాయంత్రం వెళ్లి, ఏదో విధంగా అతణ్ణి నచ్చచెప్పి, డబ్బు తెస్తాను. ఈ మండుటెండలో మరిప్పుడు వెళ్లలేను కూడాను. భగవాన్! ఈ వయస్సులో ఏమిటి నాకీ అవస్థ? ఎందుకీ ఆవేదన? ఈ మమతలూ, ఈ బంధాలనుండి నాకు ముక్తి ప్రసాదించు తండ్రీ..." నిస్పృహతో నిట్టూరుస్తూ అన్నాడు లింగమూర్తి — కాదు. తనలో తనే చివరి వాక్యాలు గొణుక్కున్నాడు.

వరలక్ష్మికి భర్తపట్ల ఎంతో జాలి జనిం చింది. కొడుకుకోసం, అతడి అభివృద్ధికోసం ఆయన ఎన్ని అవస్థలు పడ్డారో, ఆమెకు తెలుసు — ఇంకా ఆయన బాధపడుతూనే ఉన్నారు. తనకేం? ఇంట్లో కూచుంటున్నది. తనలో ఒక్క మనోవ్యధే హృదయాన్ని కాజే

# వెలుగు బాట

స్తున్నది. కాని ఆయనలో మనోవ్యధ ఉండనే ఉంది. దానికి తోడు శ్రమ, గౌరవప్రతిష్ఠలకు భంగం రాకండా ఉండాలనే తపన—ఇన్నింటిని ఎలా తట్టుకోగలరు? అదీ, ఈ వయస్సులో... అనుకుంటూ ఇంకేమీ మాట్లాడకుండానే వెళ్లిపోయింది లోపలికి.

ఆ రోజు సాయంత్రం లింగమూర్తి అను కున్న విధంగా సాంబమూర్తి దగ్గరికి వెళ్లాడు. లింగమూర్తిని చూడగానే ఎంతో ఆప్యాయంతో ఆహ్వానించాడు. ఆ ఆహ్వానంలో ఆధిక్యం ఎక్కడో తళుక్కుమంది. అది లింగమూర్తి భావనే కావచ్చు.

ఇద్దరూ కూచున్నారు... క్షణం నిశ్శబ్దం వారిద్దరిమధ్య తాండవమాడింది. ఎలా ప్రారం భించడమోనని ఆలోచన సాగిస్తున్నాడు లింగ మూర్తి.

"చెప్పండి, లింగమూర్తిగారూ! ఏమిటి ఇలా దయచేశారు?" అంటూ ప్రారంభిం చాడు సాంబమూర్తి.

"నాకు ఓ రెండువేల రూపాయిలు కావా లండీ, సాంబమూర్తిగారూ!"

"అదేమిటి? మీకు డబ్బు అవసరమయ్యిం దాండీ, లింగమూర్తిగారూ?"

లింగమూర్తి సందిగ్ధంలో పడ్డాడు — నిజం చెప్పడమా, మానడమా అని. అయితే తెలిసి, తెలిసి, జీవితంలో ఎప్పుడూ అబద్ధం ఆడి ఎరుగడు. ఎన్ని కష్టాలూ, నష్టాలూ ఒక్కొక్క ప్పుడు తటస్థపడుతున్నా, ఆ నియమాన్ని వదులుకోలేకపోయాడు ఛాందసుడైన లింగ మూర్తి. మరి — ఇప్పుడెలా అబద్ధం చెప్ప



మానవ సేవే మాధవ సేవ

చిత్రం—ఎం.అప్పారావు (రాజమండ్రి)

గలడు?

"మీతో చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదనుకోండి. మా వాడు బాంకులో ని చేస్తున్నాడన్న విషయం మీకు తెలిసిందేకదా? వాడు రెండువేల రూపాయిలు కాజేశా న్న ఆరోపణమీద, వాణ్ణి కటకటాలమధ్య పడేశా రండీ! వాడీపని చేసి ఉంటాడని నేను నమ్మను. వాడిమీద కిట్టనివాళ్లే ఎవరో ఈ కుట్రపన్ని, ఈ విధంగా పగతీర్చుకున్నారని అంటాడు వాడు. వాడి ఆవేదన అంతా ఇంతా కాదు. కన్న తండ్రిని, వాడలా ఖైదులో క్రుమ్మగ్గుతూ ఉంటే, చూస్తూ చూస్తూ ఎలా ఊరుకోవడం? నా కర్మకాక పోతే, ఇవన్నీ నేను బ్రతికుండగా చూడవలసి వచ్చింది..." చెప్పుకుపోయాడు లింగమూర్తి. అతని కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లినాయి. కళ్లను ఓసారి ఒత్తుకున్నాడు.

అంతా శ్రద్ధగా విన్న సాంబమూర్తి, సాను భూతి నిండి ఉన్న నిట్టూర్పు విడిచాడు.

"ఏమిటోనండీ, లింగమూర్తిగారూ! ఇప్పు డన్నీ వింతలే జరుగుతున్నాయి. రెండువేల రూపాయిలు కాజేసేటంతటి గుండెనిబ్బరం మీ అబ్బాయికి ఉందనుకోను. మీరన్నట్టు, ఎవరో గిట్టనివాళ్లే కుట్రపన్ని ఉంటారు..."

"మావాడూ అదే అంటాడండీ! మావాడి విషయం మీకు తెలీదా ఏమిటి? మీకుమాత్రం అనిపించడంలేదూ — వాడటువంటి నీచపుపని చెయ్యడని? నేనదే మాటంటే, కొడుకుపట్ల ఉండే అభిమానంకొద్దీ అంటున్నానని కొంద రంటారు. ఏంచెయ్యను? ఎవరేమన్నా, విని ఊరుకోవల్సిందే! ప్రస్తుతానికి వాణ్ణి ఆ చెర నుండి విముక్తి చెయ్యడం నా కర్తవ్యం. ఆ ఉద్యోగం కూడా ఊడకుండా ఏర్పాట్లు చేశా న్నండి. ఏదో, కాస్తంత నలుగుర్లో పరపతి ఉన్నవాణ్ణి కాబట్టి సరిపోయింది. లేకపోతే ఏమయ్యేదో ఆలోచించండి..."

"అదీ నిజమేలెండి... ఆ... అవుతే, రెండు వేలు కావాలంటారు?"

"అవునండీ!"

"ఇవ్వడానికి నాకేమీ అభ్యంతరం లేదండీ— కాని ఒక్క విషయం... నోటుమాత్రం రాయాల్సి ఉంటుంది. అహ... ఇలా నిర్మొహ మాటంగా చెబుతున్నానని మీరు అన్యథా భావించకండి. అదో నియమంగా పెట్టు కున్నాను."

లింగమూర్తికి నవ్వాగిందికాదు అతని ధోరణికి. ఏదైతేనేం — డబ్బు ఇస్తానన్నాడు కదా అన్న సంతోషం అతనిలో ఉప్పెనగా పొంగింది.

"ఇందులో అనుకోడానికేముందండీ, సాంబ మూర్తిగారూ! అవసరానికి ఆదుకుంటున్నారు. అదే పదివేలు..." కృతజ్ఞతా భావంతో అన్నాడు లింగమూర్తి.

"అవసరమన్నది అందరికీ ఎప్పుడో ఒక ప్పుడు, ఏదో ఒక రూపంలో వస్తుందండీ!

"ఇటువంటి సమయాల్లో ఆదుకోపోతే ఇంకేమిటి?" సగర్వంగా అన్నాడు సాంబమూర్తి. తనలాంటి సహృదయుడూ, జాలిగుండె గల వాడూ మరొకడు ఉండడన్న భావన అతని ప్రతిపదంలోనూ తొణికిసలాడింది. అదో విధమైన తృప్తి.

నోటు వ్రాయడం, డబ్బు పుచ్చుకోవడం జరిగాక సాంబమూర్తి దగ్గర సెలవు తీసుకుని ఇంటిముఖం పట్టాడు ముసలాయన. అతని అడుగులు ఉత్సాహంగా ముందుకు సాగాయి.

"డబ్బు దొరికిందా అండీ?" భర్త ఇంట్లో అడుగు పెడుతుండగానే, ఆసక్తిగా అడిగింది వరలక్ష్మి.

"సాంబమూర్తి మంచివాడుసుమా, లక్ష్మీ! నోటు రాయించుకుంటేనేంగాక! లేదనకుండా డబ్బిచ్చాడు. ఆ! నేనలా ప్లీడరు దగ్గరికి వెళ్ళి మాట్లాడి వస్తాను" అంటూ మళ్ళీ బయటికి నడిచాడు లింగమూర్తి.

"పర్మేశ్వరా! అన్నీ సవ్యంగా జరిగిపోయేట్టు చూడు తండ్రీ!" అంటూ మనసులో ప్రార్థించుకుంటూ లోపలికి పోయింది వరలక్ష్మి.

లాయరు రాజేశ్వర్రావు వయసులో చిన్నవాడైనా మంచి పేరుప్రతిష్ఠలు సంపాదించాడు. అతడు హైస్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో లింగమూర్తిగారి శిష్యవరమాణువుల్లో ఒకడు కావడం, లింగమూర్తికి మరింత ధైర్యం కలిగించింది.

"నమస్కారం, మేస్టారూ! కూచోండి..." అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు రాజేశ్వర్రావు.

లింగమూర్తి కుర్చీలో ఆసీనుడై "నాయనా రాజా! డబ్బు తెచ్చాను. ఆ డబ్బు జమకట్టి, వాణ్ణి విడుదల చేయించడానికి ప్రయత్నించు. ఉద్యోగం ఊడిపోకుండా చూసే బాధ్యత నా స్నేహితుడొకాయన తీసుకున్నాడులే. నువ్వి సహాయం చేసిపెట్టాలి మరి!" అన్నాడు.

"అంత డబ్బూ తెచ్చారా మేస్టారూ?" రాజేశ్వర్రావు ఆ ప్రశ్న వెయ్యకూడదు. కాని నోరు జారిపోయింది. మేస్టారు అంత డబ్బు యీ తక్కువ వ్యవధిలో ఎలా తీసుకువస్తారా అని ఈ రెండు రోజులూ ఎంత ఆలోచించాడో అతడికే తెలుసు. ఒక్కొక్కప్పుడు అనిపించేది తనే ఆ డబ్బు సహాయం చేస్తే బావుండునని. కాని మేస్టారు అభిమానంగల మనిషి. ఆయనేం అనుకుంటారోనని ఆ ఆలోచనకే స్వస్తి చెప్పాడు.

"అవును, నాయనా! రెండువేలు అప్పు తెచ్చాను. ఎంతయినా, వాడు నా కొడుకు. వాడీ పాడుపని చెయ్యలేదని నా అంతరాత్మ చెబుతూనే ఉంది. కాని, నా అంతరాత్మని ఎవరడుగుతారు? అసలా సాక్ష్యం ఎలా పనికి వస్తుంది? జైల్లో కూచుని వాడెంత బాధ పడుతున్నాడో, ఊహించుకుంటేనే నాకు ఏడుపొస్తుంది. ఇక వాడి తల్లి సంగతి చెప్పకు. ఇటువంటి పరిస్థితిలో నేను ఆదుకోకపోతే ఇంక వాడి గతేంకాను? చూడు, నాయనా, లోకంతీరు — ఒకరు చేసిన తప్పుకి మంగోహారు. అదీ నిర్దోషి శిక్ష అనుభవిస్తున్నాడు. న్యాయం ఎక్కడుంది చెప్పు? అవుతేనేం — నా ఆక్రందన ఎవరు వింటారు...?" బాధగా చెబుతూ జేబులోనుంచి రెండు నోట్లకట్టలు తీసి రాజేశ్వర్రావుకు యిచ్చాడు. రాజేశ్వర్రావు ఆ డబ్బు బల్లమీద ఉంచాడు.

రాజేశ్వర్రావు లింగమూర్తి ఆవేదనను అర్థం చేసుకున్నాడు. కొడుకు విడుదలకోసం అతను పడుతున్న ఆత్రుత, నిర్దోషి అయి ఉండి కూడా శిక్ష అనుభవిస్తున్నాడన్న బాధతో అతను అనుభవిస్తున్న తపన అవగాహన చేసుకున్నాడు. ఆ ముసలాయన భావాలు, అతని హృదయాన్ని స్పందింపజేశాయి. కాని, అతనికి తెలుసు — లింగమూర్తి కొడుకు రాంబాబు తండ్రి భావిస్తున్న విధంగా సత్ప్రవర్తనుడు కాదని. రాంబాబుతో అతనికి అంత సన్నిహితమైన స్నేహబంధం లేదుగాని, క్లబ్బులో అతని గురించి నలుగురూ ఏం అనుకుంటున్నారో, అంతా రాజేశ్వర్రావుకు తెలుసు. తనకు తెలిసినదంతా మేస్టారుగారికి తెలియజేసి, అతనికి కనువిప్పు కలిగించడం ఒక విధంగా శ్రేయోదాయకమనీ, ఆ కుటుంబం బాగుపడేందుకు అది దోహదమవుతుందనీ తలంచాడు. కాని — చెబితే ఏంబాధ పడతాడోనన్న భయం కూడా లేకపోలేదు. అయితే, తను చెప్పకపోవడంవల్ల ఆ ముసలాయన శాశ్వతమైన బాధకు గురి కావలసివస్తుందేమో! అప్పుడు తను విచారించి ఫలితం ఉండదు... క్షణం ఆలోచించాడు. చెప్పడానికే నిశ్చయించాడు.

"మీరు ఎంత సహృదయులండీ, మేస్టారుగారూ! నిజంగా మీవంటి తండ్రిగల రాంబాబు జన్మ తరించిందనే చెప్పాలి. కాని, కాని... ఒక్క విషయం. ప్రతి తండ్రీ తన పిల్లలు సత్ప్రవర్తనగలవాళ్ళేనని అనుకోవడంలో తప్పేం లేదు; పొరపాటు అంతకన్నాకాదు. అయితే, ఒక్కొక్కప్పుడు, ఆ భావం మూఢనమ్మకంగా స్థిరత్వం పొందుతుంది. అదే మంచిదికాదనుకొంటాను. నిజం చెబితే, మీ మనసు ఎంత బాధపడుతుందోగాని, చెప్పలేకుండా ఉండలేను. మీ అబ్బాయి మీరు భావిస్తున్నంత మంచివాడేం కాదు. ఆయన క్లబ్బులో ఎటువంటి కలకలం రేపుతున్నాడో, ఎటువంటివారితో సహవాసం చేస్తున్నాడో మీకు తెలీదు. ఆమధ్య ఓ మార్వాడీ తనకివ్వవలసిన డబ్బుకోసం గామోలు నిలదీసి మీవాణ్ణి అడుగుతుండటం కళ్ళారా చూశాను. వాళ్ళిద్దరికీ కొట్టుకునేంతటి వివాదం జరిగింది. అందరంకూడి ఎలాగో విడిపించాం. మీతో ఇవన్నీ చెప్పకూడదనుకోండి. నిజంగా మీ మనసులో ఎటువంటి సంక్షోభం ఉత్పన్నమవుతుందో అర్థంచేసుకోగలను. కాని, మీవంటి సహృదయుల సమక్షంలో తెలిసిన విషయం చెప్పకుండా ఉండలేకపోతున్నాను.



మధు కలశం

చిత్రం—కరిడె సత్యనారాయణ (విజయనగరం)

చెప్పకపోతే మిమ్మల్ని మోసం చేస్తున్నానన్న బాధ నాకు మిగులుతుందని చెప్తాను. మీతో చెప్పడానికి నోరు రావడంలేదు గాని—మీవాడికి ఓ వేశ్య సాహచర్యంకూడా ఉందని ఇటీవల ఎవరో అంటుండగా విన్నాం. ఎందుకైనా మీరతన్ని కాస్త మందలించి, అదుపులో పెట్టడం మంచిది, మేస్టారూ!"

లింగమూర్తి ముఖం వెలవెల బోయింది. అతని కళ్ళు గిర్రున తిరిగాయి. కళ్ళముందంతా శూన్యంగా కనిపించింది. మొహమంతా స్వేదంతో నిండిపోయింది. తను వింటున్నదంతా ఏమిటి? ఇదంతా నిజమేనా? నిజం కాకపోతే, తన కొడుకుమీద లేనిపోని చాడీలు చెప్పడానికి రాజేశ్వర్రావుకు అవసరమేముంది? కొడుకు మంచితనం గురించి తను అందరితో చెప్పుకుంటున్నాడే! అయితే, తన అమాయకత్వానికి తన పరోక్షంలో అంతా నవ్వుకుంటున్నారా? ఏమో? అయి ఉండవచ్చు. అతనికి ఏడుపు వచ్చినంత పనయింది. 'భగవాన్! ఏమిటిదంతా? ఈ వృద్ధాప్యంలో మనశ్శాంతి లేకుండా, నా హృదయాన్ని కల్లోలపరచడమే నీ వాంఛితమా?' అనుకుంటూ లోలోన కుమిలిపోయాడు.

"ఇదంతా నిజమేనా, బాబూ?" కంపిస్తున్న స్వరంతో అడిగాడు లింగమూర్తి. రాజేశ్వర్రావు నిట్టూర్పు విడిచాడు.

"మేస్టారూ! అతనిమీద చాడీలు చెప్పడానికి, అతను నాకేం విరోధా ఏమిటి చెప్పండి? నేను క్లబ్బులో చాలామంది నోట ఎన్నో విషయాలు విన్నాను. ఒకటి, రెండు సంఘటనలు స్వయంగా చూశాను. అందుకే, ఈ సందర్భంలో మీతో చెప్పడానికి సాహసించాను. మీరు సహృదయంతో నన్ను అర్థం చేసుకుంటారనే నా భావం."

# వెలుగు బాట

లింగమూర్తి ముఖంలో విషాదచ్ఛాయలు అలముకున్నాయి.

"ఎంత దురదృష్టవంతులం, నాయనా! ఒక్కగాని ఒక్క కొడుకని ఎంతో అల్లారు ముద్దుగా పెంచాం. చదువు చెప్పించాం. వాడికి నచ్చిన ఉద్యోగం సంపాదించిపెట్టాను. 'నౌకరీకం ఉంది పెళ్లి చేసుకోరా' అని వాళ్ళమ్మా, నేనూ ఎంత చెప్పినా వినిపించుకోలేదు. అయినా వాడి మనసుకి కష్టం కలిగించడ మెందుకని బలవంతపరచలేదు. వాడి అభిమతాన్ననుసరించే మా అభిప్రాయాలు మార్చుకునే వాళ్ళం. మేం వాడిపట్ల చూపుతున్న అభిమానానికి, ఆదరానికి ప్రతిఫలంగా వాడు మాకీ మనోవ్యధను ప్రసాదిస్తున్నాడు. వాడి ప్రవర్తన ఇంత జుగుప్సాకరంగా ఉంటుందని ఇంత వరకూ మాకు తెలీదు, నాయనా! ఇప్పటి కైనా, నాకు జ్ఞానోదయం కలిగించావు. మంచి దయింది. మరి నే వస్తా..." అంటూ బల్లమీదున్న డబ్బు తీసుకుని మళ్లీ జేబులో పెట్టేసుకున్నాడు.

రాజేశ్వర్రావు స్తంభించిపోయాడు. నోట మాట రావడం కష్టమయింది. లింగమూర్తి గారి ప్రవర్తన అతనికి అవగాహన కాలేదు.

"అదేవిటి, మేస్టారూ! డబ్బు తీసుకు పోతున్నారేవిటి?" అన్నాడు ఆశ్చర్యంతో.

"వాడు ఆ శిక్ష అనుభవించడమే మంచి దనిపిస్తుంది, నాయనా! అప్పుడైనా వాడిలో పరివర్తన వస్తుందేమో! వాడి నిర్దోషిత్వాన్ని తలపోసుకుని, జాలిపడి, తండ్రిగా నా బాధ్యత తీర్చుకోవాలనుకుని ఈ ప్రయత్నం చెయ్యక తప్పిందికాదు. కాని, వాడు నిజంగానే ఆ డబ్బు కాజేసి ఉంటాడన్న నమ్మకం నాకిప్పుడు కలుగుతోంది. అటువంటివాణ్ణి విడుదల చేయించినా, వాడిలో పశ్చాత్తాపం రాదు. పైగా, పరోక్షంగా ప్రోత్సహించినట్టుంటుంది కూడాను. అది నాకు ఇష్టంలేదు. కొడుకే అవుగాక! మనింటి 'నిప్పు' అని మనం ఒడిలో వేసుకోగలమా?" అన్నాడు లింగమూర్తి. అతని కళ్ళు అప్రయత్నంగా నీళ్ల పర్యంతమైతే, కండువాతో ఒత్తుకున్నాడు.

లింగమూర్తి బాధను చూసి, రాజేశ్వర్రావు అప్పుడనుకున్నాడు — తను ఆ విషయాలన్నీ చెప్పడం పొరపాటేనని. ముసలాయనపట్ల అవ్యాజమైన జాలి జనించింది.

"మేస్టారూ! మీరన్నది కూడా నిజమే! కాని, చూస్తూ, చూస్తూ, ఎలా ఊరుకో గలరు? ఎప్పుడూ అనుభవించని శిక్ష ఇప్పుడు కొద్దికాలమైనా అనుభవించాడు గాబట్టి, తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడ్డానికి అవకాశం ఉంది. ఈ ఒక్క అవకాశం ఇవ్వండతనికి. మీరు వచ్చి విడిపిస్తారని, ఎంతో ఆశతో ఉంటాడు. అతని ఆశల్ని అంతం కానివ్వకండి. మీ బాధేవిటో నాకు తెలుసు. కాని, తండ్రిగా మీ కర్తవ్యం ఒకటుంది. మీకు నేను చెప్పవలసిన వాణ్ని కాదు." ప్రావేయత ఉట్టి పడుతున్నట్టుగా అన్నాడు రాజేశ్వర్రావు.

"నాకు మరేమీ చెప్పకు, బాబూ! నా మనసు విరిగిపోయింది. వాడా శిక్ష అనుభవించని!"

"మేస్టారుగారూ! మీవంటి జాలి హృదయులు కూడా ఇంత కఠినంగా ప్రవర్తిస్తారని ఎప్పుడూ అనుకోలేదు. ఈ ఒక్క అవకాశమూ ఇచ్చి చూడండి. ఇది, నా అభ్యర్థన. నేనెందుకిట్లా అభ్యర్థిస్తున్నానని మీకు అనిపించవచ్చు. అందుకు వేరే కారణం ఏమీ లేదు. మీ అబ్బాయిపట్ల మీలో ప్రగాఢంగా ఉండే అభిమానాన్నంతా తుడిచేసే అవకాశం కల్పించింది నేను. ఆ అపవాదు నాకు రావద్దు, మేస్టారూ! అందుకే ఈ ఒక్క అవకాశం ఇవ్వమని అర్థిస్తున్నా..."

లింగమూర్తి క్షణంసేపు తీవ్రంగా యోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఎలాగూ తను కొడుకును విడుదలచేయించే ప్రయత్నం మీదే వచ్చాడు. రాజేశ్వర్రావు ఆ విషయాలన్నీ చెప్పకపోయినట్లయితే, తను విడుదలకు ఏర్పాటు చెయ్యమని లాయరును ప్రాధేయపడేవాడే! తను నిర్ణయించుకున్నది జరిగిపోవడమే మంచిది. తండ్రిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించుకొని, వాడి దురదృష్టానికి వాణ్ణే వదిలేయడమే తనిప్పుడు చేయవలసింది — అన్న నిర్ణయానికి వచ్చాడు.

"సరే, బాబూ! నువ్వెందుకు బాధపడ్డం! మొండిపట్టు పట్టుక్కూర్చుంటే మా ఆవిడకూడా బాధ కల్గించినవాణ్ణవుతాను. విడుదల చేయించే ఏర్పాటు చేయించు, బాబూ!" అంటూ జేబులో పెట్టిన డబ్బు తీసి మళ్లీ యిచ్చాడు.



నవోఢ

చిత్రం—కడార్ల శేషయ్య (మిరియాలగూడ)

రాజేశ్వర్రావు తృప్తిగా నిట్టూర్చాడు. "రేపు మీరు కోర్టుకి వస్తారుగా!" అన్నాడు డబ్బు డ్రాయర్లో పెడుతూ.

"కోర్టుకి రావడం నా కిష్టంలేదు, నాయనా! వాణ్ని విడిపిస్తే చాలు — అక్కడితో నా బాధ్యత తీరిపోతుంది." బాధగా అన్నాడు లింగమూర్తి.

"మీరు రాకపోతే, అతడు ఎంత బాధ పడతాడో ఆలోచించారా! రండి, మేస్టారూ!"

రాజేశ్వర్రావు అంటున్న ప్రతి మాటకూ కరిగిపోతున్నాడు లింగమూర్తి. ఆ మాటల్లోనే ఆశక్తి ఉందో, లేకపోతే కొడుకుపట్ల తనకుండే అభిమానమే ఇలా చేయిస్తుందో, ఇదమిత్థమని తేల్చుకోలేకపోయ్యాడు.

"అలాగే, నాయనా! వస్తాలే. మరి నే వెళ్లొస్తా" అంటూ బయలుదేరాడు లింగమూర్తి.

"మంచిది, మేస్టారూ! మీరేమీ బాధ పడకండి. అన్నీ సర్దుకుపోతాయి." మేస్టార్ని ద్వారంవరకూ సాగనంపి వచ్చాడు రాజేశ్వర్రావు.

వస్తూనే కుర్చీలో కూలబడ్డాడు ఉస్సు రనుకుంటూ. తను అనవసరంగా మేస్టారుగారి సున్నిత హృదయానికి తట్టుకోలేని ఘాతం తగిలించాడేమో — అని బాధపడ్డాడు క్షణం సేపు. అయినా, తను మంచికోసమే అలా చేశాడు—అని మళ్లీ సమాధానపరుచుకున్నాడు.

* * *

మర్నాడు రాంబాబు విడుదల అయ్యాడు. రాంబాబు, ఉత్సాహంగా బయటికివస్తూ రాజేశ్వర్రావుకు కృతజ్ఞత తెలుపుకొని, కాస్త దూరంలో చెట్టుకిందను నిలుచున్న తండ్రిని చూసి "నాన్నా..." అనుకుంటూ వెళ్లాడు.

లింగమూర్తి మౌనముద్రలో ఉన్నాడు. కొడుకు విడుదల అయ్యాడన్న ఆనందం అతనిలో లేశమాత్రం కనిపించలేదు. రాంబాబుకు తండ్రి నిర్లిప్తత అర్థంకాలేదు.

"ఏం, నాన్నా, అలా ఉన్నారు? ఇప్పుడు నేను విడుదల అయ్యానుకదా, ఇంక విచారమెందుకు?"

లింగమూర్తి బాధగా నిట్టూర్పు విడిచాడు. "మా విచారం, మా బాధ, నువ్వు జైలుకి పోయావని కాదురా! కాని నువ్విలా ఎందుకు మారావా అన్నదే హృదయాన్ని దగ్ధం చేస్తున్నది." బొంగురు గొంతుతో అన్నాడు. తండ్రి కళ్లు చెమ్మగిల్లడం స్పష్టంగా చూశాడు రాంబాబు. రాంబాబుకు ఆ మాటలు శరీరంలో విద్యుత్తులా ప్రవహించాయి.

"నేనేం మారలేదు, నాన్నా! మీరు అపార్థం

(తరువాయి 57 వ పేజీలో)

# వెలుగు బాట

( 8 వ పేజీ తరువాయి)

చేసుకుంటున్నారు. నేనే డబ్బు కాజేయలేదని మొన్ననే చెప్పానుగా మీతో? నా మాట నమ్మండి...'' తండ్రిని నమ్మించాలని, ఇంకా ప్రయత్నిస్తున్నాడు రాంబాబు.

లింగమూర్తి ఆదోలా నవ్వాడు. ఆది ఆనందంతో నవ్విన నవ్వుకాదు. అందులో బాధ తొంగిచూస్తున్నది. అందులో ఎన్నో అగాధాలు కనిపిస్తున్నాయి.

''నువ్వు చెప్పిన ప్రతి మాటా ఇంతవరకూ నమ్మామురా, అబ్బాయ్. నువ్వు ఎంతో ఉత్తముడవనే నమ్మాను. నేనే కాదు. మీ అమ్మ కూడాను. నాకూ, మన ఇంటికీ, వంశానికీ పేరుప్రతిష్ఠలు తెస్తావన్న ఆశ ఉండేది. కాని, నీ విషయంలో మేం పొరబడ్డామని ఇప్పుడనిపిస్తోంది. నీ గురించి ఇంతవరకూ మేం విన్నవన్నీ నెమరువేసుకుంటుంటే ఇంకా మేం ఎందుకు బ్రతికి ఉన్నామా అన్న జుగుప్స కలుగుతోంది...'' రుద్ధస్వరంతో మెల్లగా చెప్పుకుపోతూ ఆగాడు.

రాంబాబు తండ్రి మాటలకు కాస్త కలవరపడ్డాడు.

''ఏమిటి విన్నారు, నాన్నా?''

''నేను వేరే చెప్పాలా ఏమిటి? నీ దుష్ట సహవాసాలూ, చెడుతిరుగుళ్ళూ, మార్వాడీల దగ్గర అప్పుతీసుకుని, అవమానం పొందడం— ఇంకా ఎన్నో విన్నాం.'' అనుకోకుండా ముసలాయన కళ్ళు కోపంతో ఎర్రబడినాయి. ప్రయత్నం మీద కోపాన్ని అరికట్టుకోగలిగాడు.

''ఎవరు చెప్పారీ విషయాలు?'' చిరు కోపంతోనే అడిగాడు రాంబాబు.

''ఏం? పేరు చెబితే వాళ్ళపై ప్రతీకారం తీర్చుకుంటావా? కాని, వాళ్ళ పేర్లు నాకు తెలీవు. ఒకరా, ఇద్దరా? అసలు నీ నిజ రూపం తెలిసిన తర్వాత, నిన్ను విడుదల చేయించకుండా ఉండాలనుకొన్నాను. కాని, తండ్రిగా నాలో ఉన్న మమత, నన్నంత కటికవాణ్ణి చెయ్యలేదు...'' అని అంటూ ''ఏదో నా బాధ్యత నేను తీర్చుకున్నాను. ఇక నీ దారి నువ్వు చూసుకోవడం శ్రేయోదాయకం. నా యింట్లో ఇంక నీకు స్థానం లేదు'' అన్నాడు కాస్తంత కోపంతోనే.

''నాన్నా!'' తలమీద పిడుగుపడినట్టయింది రాంబాబుకు. ''ఎవరో గిట్టనివాళ్ళు మీతో నా గురించి చెడ్డగా చెప్పి ఉంటారు, నాన్నా! మీరు నమ్మకండి...'' అన్నాడు ఇంకా తనను తను సమర్థించుకుంటూనే.

లింగమూర్తి మెల్లగా నవ్వాడు. ''రామూ! ఎందుకింకా నన్ను చీకటిలో ఉంచి, నువ్వు చీకటిలో ప్రయాణిస్తావు? ఈ వయసులో ఏదో నా జీవితం ప్రశాంతంగా గడుస్తుందని అనుకున్నాను. కాని, అలా జరగనందుకే నా విచారమంతాను. అవుతేనేం, నా మనస్సు విరిగిపోయింది. ఇంక నువ్వెన్ని చెప్పినా, నమ్మే స్థితిలో లేను. నువ్వేం చేస్తున్నావో, ఏం చెప్తున్నావో, అన్నింటికీ నీ అంతరాత్మే సాక్షి! ఆ సాక్ష్యాన్ని నువ్వు కాదనలేవు. నా కర్తవ్యం నెరవేర్చుకున్నాను... వస్తా'' అంటూ చరచరా ఇంటివేపు నడిచాడు. అతని కళ్ళనుండి అశ్రువులు ధారాపాతంగా చెక్కిళ్ళమీదికి జాలువారుతున్న విషయం పాపం రాంబాబుకు తెలీదు.

రాంబాబుకు లోకమంతా చీకటిమయంగా కనిపించింది. తనను ఎంతో ముద్దుమురిపాలతో పెంచిన తండ్రేనా ఇలా అంటున్నది? ఎందుకిలా జరిగింది? తన ప్రవర్తన వివరాలు ఆయనకు ఎలా తెలిశాయి? తను ఇప్పుడు ఎక్కడికి వెళ్ళడం? శిక్ష తప్పింది కదా అన్న సంతోషంతో ఉయ్యాలలూగుతున్న హృదయం హఠాత్తుగా తగిలిన ఈ ఘాతానికి తట్టుకోవలసిందేనా? — అతనికి అంతా అయోమయంగా కనిపించింది పరిస్థితి. హృదయ స్పందన ఉధృతమయ్యింది. తండ్రి వెళ్ళిపోతున్న వైపే చెమ్మగిలిన కళ్ళతో తదేకంగా చూస్తూ నిలుచున్నాడు. తండ్రి నిర్ణయానికి తిరుగుండదని, అతనికి తెలుసు. పోనీ, ఇంటికి పోయి అమ్మను ప్రాధేయపడితే! ఊహూ, లాభంలేదు. నాన్న తనను లోపలికి రానివ్వరు. వెళ్ళినా అమ్మమాత్రం నాన్నకు ఎదురు చెప్పగలదా?... తనకు తెలుసు, ఎదురు చెప్పలేదని. అయితే, తనిప్పుడు ఎక్కడికి వెళ్ళడం?

రాంబాబు తీవ్రంగా ఆలోచించాడు. అతని దృష్టిలో ఒకే ఒక వ్యక్తి మెదిలింది. ఆమె కాంతం. తను వెళ్ళితే ఆమె ఎంతో ఆదరంతో ఆహ్వానిస్తుంది. ఆమెకుమాత్రం తెలీదా! ఆమె కోసం తను ఎంత డబ్బు వ్యయపరిచాడో! నిజం చెప్పుకోవాలంటే ఈ రెండువేల రూపాయిలు కాజెయ్యడం, ఆమె మూలంగానే జరిగింది. ఈ సంఘటనకు మూలకారణం కాంతమే. అటువంటి కాంతం తనను ఆదరించకుండా ఉండదు. దిగాలుపడిన అతని హృదయం ఉత్సాహాన్ని పుంజుకుంది. చరచరా నడిచాడు.

కాంతం ఇల్లు సమీపిస్తున్నకొద్దీ, రాంబాబు గుండెలు విపరీతంగా కొట్టుకోసాగాయి. అందుకు ప్రత్యేకించి కారణం ఏమీ లేదు. ఎప్పుడు ఆమె యింటికి వెళ్ళినా చీకటి పడ్డాకనే వెళ్ళేవాడు. కాని ఇప్పుడు పట్టపగలు వెళ్ళవలసి వచ్చింది. అది తప్పనిసరి కావడంవల్ల, అంతగా బాధపడలేదు రాంబాబు. అతనికి ప్రపంచంతో నిమిత్తమే లేదు మరి!

కాంతం ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. చప్పున ఆగిపోయాడు. అతనికి లోపల ఏదో మగగొంతుక, తర్వాత ఆ గొంతుతోపాటు కాంతం గొంతు మేళవించి పకపక నవ్వడం వినిపించింది.



తిరస్కృతి

చిత్రం—ఎస్. రత్నాకర్ (దాదారం)

---

మీద పారిపోతూన్నవారిని చూపించాడు గోపీ వారిని వెంబడించి కొందరు పోలీసులు వెళ్లారు. ఇది విని ఇన్‌స్పెక్టరు కూడా అటు బయలుదేరారు జీపులో.

ఓ అరగంట దాటలేదు. అందరు దొంగలనూ చుట్టుముట్టి పట్టుకువచ్చారు పోలీసులు బంగారం, నగలు, ధనం అన్నీ స్వాధీనం చేసుకున్నారు.

గోపీ సహాయం లేనిదే దొంగలు దొరికేవారా? దొరకి ఉండరు. గోపీ ధైర్య సాహసాలను అందరూ మెచ్చుకున్నారు. బహుమానించారు అతన్ని. ''ముందు ముందు పెద్ద డిటెక్టివుగా తయారవుతావు నువ్వు'' అంటూ ఆశీర్వదించారు రాంసింగు. అందరూ గోపీ ధైర్యసాహసాలను మెచ్చుకున్నారు. ఇక స్కూలు ప్రధానోపాధ్యాయులు మరీను! "బడికే గౌరవం తెచ్చా"వని మెచ్చుకున్నారు గోపీని.

(సమాప్తం)

ఆ సంఘటన రాంబాబులో కోపం తెప్పించినా, ప్రయత్నంమీద తమాయించుకున్నాడు — ఆమె వృత్తిని దృక్పథంలో పెట్టుకొని తలుపు తట్టాడు.

కొద్ది క్షణాల్లో కాంతం వచ్చి తలుపు తెరిచింది. రాంబాబు ఆమెను చూడ్డంతోనే ఆనందంతో మందహాసం చేశాడు. కాని, ఆ మందహాసానికి ప్రతిగా ఆమె నవ్వలేదు...

"మీరా! ఏం వచ్చారు?" మొహం అదోలా పెట్టి అంది.

ఆమె అంతరార్థాన్ని ఇంకా గ్రహించలేక పోయాడు రాంబాబు. జరిగినదంతా సవిస్తరంగా చెప్పాడు. కాంతం అంతా విని మొహం చిట్లించుకుంది.

"క్షమించండి. మీరు నా యింట్లో ఉండటం, నాకే క్షేమకరంకాదు. మీతోపాటు నేనూ చిక్కుల్లో యిరుక్కోవల్సి వస్తుంది. సెలవ్!" అంటూ అతని మాటకైనా ఎదురు చూడకుండా తలుపు దభీమని వేసేసింది.

రాంబాబు స్తంభించిపోయాడు. కాంతం ధోరణి ఎంతలో మారిపోయింది? అతనికి ఏడుపు వచ్చింది. వేశ్యకు హృదయముండదని అందుకే గామోసు అంటారు! తెమెకోసం తను ఎన్ని అనర్థాలకు తావిచ్చాడు! ఆఖరికి గౌరవప్రతిష్ఠలు సర్వనాశనంచేసే జైలుశిక్ష కూడా రెండు రోజులు అనుభవించాడు. చివరికి అదైనా ఆలోచించిందికాదే? ఎందుకు ఆలోచిస్తుంది? తను ఏమైపోతే ఆమెకేం కావాలి? మళ్లీ ఆలోచనలలోపడి నడుస్తున్నాడు. గమ్యం ఏమిటో అతనికే తెలీదు. అయితే ఇప్పుడు ఎక్కడికి పోవడం? ఆ అవును...రాజారావు ఇంటికి వెళ్లితేసరి. అతడు తనకు ప్రాణ మిత్రుడు. అసలు, ఈ రెండువేలూ కాజెయ్యమని సులువు చెప్పిందికూడా అతడే! కాంతంతో తనకు పరిచయం చేసినవాడూ అతడే. తనంటే అతడికి అపరిమితమైన అభిమానం — తనను ఈ స్థితిలో తప్పకుండా ఆదుకుంటాడు అనుకుంటూ ఉత్సాహంగా అడుగులు వేశాడు రాంబాబు.

రాజారావు ఇంట్లో లేకపోవడం రాంబాబుకు నిరుత్సాహం కలిగించిందనే చెప్పాలి. అతను వచ్చేవరకూ తను అక్కడే ఉండటం మంచిదనుకున్నాడు. ఆకలి ఒక ప్రక్క దహించి వేస్తున్నది. వెళ్లి ఏ హోటల్లోనో కాఫీ త్రాగాలంటే డబ్బులేమీ లేవు. తన పరిస్థితి ఇంత నికృష్టపు స్థాయికి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. అతనికి ఏడుపు వచ్చినంత పనయింది. తను ఇంకెక్కడికి పోతాడు? రాజారావు వచ్చేకనే వెళ్లవచ్చు అనుకుంటూ అరుగుమీద కూలబడి స్తంభానికి చేరబడ్డాడు. అలసటవల్ల నిద్ర వస్తున్నది. మెల్లగా అరుగుమీద ఒరిగాడు. క్షణంలో అతనికి మైకం కమ్మింది. ఆకలి, ఆవేదనల బారినుండి తప్పించుకుందుకు అదే మంచి మార్గమనుకున్నాడేమో!

సాయంత్రం ఆరు గంటలకు రాజారావు

## వెలుగుబాట

ఇల్లు చేరుకున్నాడు. అరుగుమీద నిద్రపోతున్న దెవరోనని తట్టిలేపాడు. రాంబాబును చూసి ఆశ్చర్యపోయాడనే చెప్పాలి.

"ఏమిటోయ్, రాంబాబూ! ఇక్కడ పడుకున్నావేమిటి? ఇంటికి వెళ్ళలేదూ? నువ్వు విడుదల అయ్యావని తెలిసి చాలా సంతోషించాను. నీకు మొదటే చెప్పానుగా — మీ నాన్న తప్పకుండా విడిపిస్తారని..." అని నవ్వుతూ అన్నాడు.

రాజారావును చూశాక శరీరకంగా కూడా కొంత బలం వచ్చింది రాంబాబుకు. ఓసారి గట్టిగా నిట్టూర్చాడు.

"రాజారావ్, మా నాన్నగారు నన్ను జైలునుండి విడుదల చేయించినమాట వాస్తవమే! కాని, నన్ను ఇంట్లో అడుగుపెట్టవద్దని శాసించారు..." అంటూ అంతా వివరంగా చెప్పాడు, తన నిర్ణయంతోసహా.


అంతా విన్న రాజారావు ముఖకవళికలు మారినాయి.

"మంచి చిక్కే తెచ్చిపెట్టావోయ్. మా ఇంట్లో ఉండడానికి అవకాశంలేదే." నీళ్ళు నమిలాడు.

"రెండు మూడు రోజుల్లో నేను వేరే ఇల్లు చూసుకుంటాను, రాజారావ్..." ప్రాధేయంగా అన్నాడీసారి.

"లాభంలేదు, రాంబాబూ! మరేమీ అనుకోకు. నాకు వేరే పనుంది. నువ్వు వెళ్లిక. ఏం..." అంటూ చరచరా ఇంట్లోకిపోయి తలుపు వేశాడు.

రాంబాబుకు ఈసారి ఏడుపు రాలేదు. ఉప్పెనలా ఉద్రేకం పొంగుకువచ్చింది. అతని కళ్ళు



తీరవాసులు

చిత్రం—ఘంటసాల వాసు (మద్రాసు-33)

నిప్పురవ్వల్లా మెరుస్తున్నాయి. ఏమిటీ ప్రపంచం? ఏం మనుషులు వీళ్ళు? మనిషికి సంఘంలో ఉన్న విలువ ఎట్లాంటిది? అవసరానికి ఆదుకోలేరుగాని, వాళ్ల అవసరాలు తీర్చుకుందుకు వెన్నంటి ఉంటారు. వీళ్లల్లో స్వార్థం తప్పించి, మరో గుణం లేదేమో? తను డబ్బు అందిస్తున్నప్పుడు తనతో సహవాసం చేస్తూ, సన్నిహితంగా ఉండేవారు. తను ఒక్కసారి పతనమైపోతే తనకు దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నారీ వ్యక్తులే! సాంఘికంగా పతనం చెందిన వ్యక్తులకు విలువ ఉండదా? ఆ విషయాన్ని తనిప్పుడు స్వానుభవంతో అవగాహన చేసుకున్నాడు. తన ప్రవర్తన బాగులేదన్న కోపంతో తండ్రి ఇంటికి రావద్దన్నాడు. ఆదరిస్తారనుకున్న కాంతం, రాజారావు హృదయం లేనట్టుగా ప్రవర్తించి, తనను ఛీత్కరించుకున్నంతపని చేశారు. వీళ్ల కోసమేకదా తను పరువు, మర్యాద, చివరికి తల్లిదండ్రులను కూడా దూరం చేసుకున్నాడు? ఇప్పుడు మార్గమేమిటి? తను ఇంతవరకూ చేసిన పాపాలకు తగిన శాస్తి ఇప్పటికే అనుభవించాడు. ఇకనైనా తను లోకం దృష్టిలో దిగజారిపోకూడదు. జరిగిందంతా ఓ కలలా భావించి, విస్మరించడం మంచిదేమో? మళ్లీ తను కొత్త జీవితం ప్రారంభించాలి. ఇప్పుడు తనకు కనిపిస్తున్న మార్గం ఒక్కటే! నేరుగా వెళ్లి నాన్న కాళ్లమీద పడడం. కాంతం, రాజారావు — ఇటువంటి పీడపురుగులను ఆశ్రయించేకంటే, కన్న తండ్రి కాళ్లమీద పడి ప్రాధేయపడడం మంచిది. ఆయనే తనకు వెలుగు చూపించారు. తను నిజమైన స్నేహితులని ఒకప్పుడు భావించినవారి నిజరూపం తెలుసుకోవడం కూడా నాన్నగారివల్లనే జరిగింది. అటువంటి వ్యక్తి తనను క్షమించక పోరు, కనీసం తన పరిణామం తెలిసినంతర్వాతనైనా—అనుకున్నాడు రాంబాబు. ఆ నిర్ణయం ఆలస్యమైనా, ఇంక జాప్యం చెయ్యకుండా చరచరా నడిచాడు ఇంటివేపు.

వీధిలోని విద్యుద్దీపాలు కాంతివంతంగా ప్రకాశిస్తూ, చీకటిని దూరంగా నెట్టుతున్నాయి. చల్లగా గాలి వీస్తున్నది. రాంబాబు నీరసంగా అడుగులు వేసుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. తలుపులు తెరిచే ఉన్నాయి. ఓసారి ఇంట్లోకి తొంగి చూశాడు. తండ్రి వాలుకుర్చీలో కూచుని ఏదో ఆలోచనాముద్రలో ఉన్నట్టు కనిపించాడు. ఆ ఆలోచనలు తన గురించేనని రాంబాబు భావం! చప్పున లోపలికి నడిచాడు. మాటాడకుండా తండ్రి కాళ్లను పెనవేసుకున్నాడు.

"నాన్నా! నన్ను క్షమించండి, నాన్నా! నాకు జ్ఞానోదయమయింది. ఇన్నాళ్లూ మంచీ, చెడూ తెలిసికూడా తమస్సులో ప్రయాణించాను. మీ మనసుని గాయం చేశాను. నా తప్పు నేను ఒప్పుకుని పశ్చాత్తా

పడుతున్నాను, నాన్నా! అంతేకాదు. నన్ను నేనే అసహ్యించుకుంటున్నాను. చీకటిలో ప్రయాణిస్తున్న నాకు వెలుగుబాట చూపించారు. లేకపోతే, నా బ్రతుకు ఇంకా సర్వనాశనమైపోయేది. నన్ను క్షమించండి, నాన్నా! క్షమించాననండి, నాన్నా! మీరు క్షమించకపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం." రుద్ధస్వరంతో అంటున్న రాంబాబు కళ్లనుండి అశ్రుధారలు జారి లింగమూర్తి పాదాల్ని ప్రక్షాళితం చేశాయి.

లింగమూర్తిలో ఉన్న సహజమైన జాలి గుండె ద్రవించిపోయింది. అతని కళ్లు చెమ్మగిల్లాయి. అప్పుడే కొడుకు గొంతు విని లోపలినుంచి వచ్చింది వరలక్ష్మి. కొడుకు తండ్రి పాదాలముందు ఉండటం చూసింది. ఆమెలో ఆనందం విప్పారింది. "క్షమించాననండి. వాడి తప్పును వాడు ఒప్పుకుంటున్నాడుగా! వాణ్ని మనమే క్షమించకపోతే, ఇంకెవరు క్షమిస్తారు చెప్పండి!" అంది దగ్గరగా వచ్చి.

లింగమూర్తి చెమ్మగిల్లిన కళ్లను ఓసారి ఒత్తుకుని రెండుచేతులతో కొడుకును లేవదీస్తూ "లేరా, నాయనా! క్షమించడానికి నేనెవర్ని? ఆ పరమేశ్వరుడే క్షమించాలి. అందరమూ అతని సమక్షంలో నేరస్థులమే! చేసిన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడ్డంతో సరిపోదురా! ఆ తప్పుల్ని చెయ్యకుండా సక్రమ మార్గంలో పోవడమే ఆ పశ్చాత్తాపానికి విలువిచ్చినట్టవుతుంది" అన్నాడు.

రాంబాబు ఉత్సాహంతో కళ్లు తుడుచుకుని లేచాడు. అతని హృదయం ఎంతో తేలికపడింది. ఆ క్షణంలో ఆకలిబాధ కూడా తెలీటం లేదు.

"నిజంగా మీరు ఎంత మంచివారు, నాన్నా! మీ హృదయాన్ని గాయపరిచిన నా ప్రవర్తనకు, నేను జీవితాంతం బాధపడుతూనే ఉంటాను. అదే నాకు పరోక్షంగా విధించబడిన శిక్ష. ఇప్పుడు నేను మరో నిర్ణయానికి వచ్చా, నాన్నా. జాప్యం లేకుండా నాకు పెళ్లి చేసెయ్యండి. సరస్వతినే వివాహం చేసుకుంటాను" అన్నాడు.

లింగమూర్తి ఆశ్చర్యంతో కొడుకువేపు చూశాడు. వరలక్ష్మి ఆనందానికి పరిధిలేకపోయింది. మేనరికం చేసుకుందుకు ఒప్పుకున్నాడనే ఆమె ఆనందం. ఆ వృద్ధ దంపతుల ముఖాల్లో ఒక్కసారి వెలుగు మెరిసినట్టయింది.

"హమ్మయ్య! నీ ఈ నిర్ణయం మాకు సంతోషకరమైన విషయంరా, రామూ! మీ మావయ్యకి రేపే ఉత్తరం రాస్తాను..." అన్నాడు లింగమూర్తి ఉత్సాహంగా.

"పదరా, నాయనా! స్నానంచేసి భోజనం చేద్దువుగాని..." అంటూ వరలక్ష్మి కొడుకును లోపలికి తీసుకుపోయింది.

లింగమూర్తి లోపలికి వెళ్తున్న కొడుకు వేపు చూస్తూ, తృప్తిగా నిట్టూర్చి వాలు కుర్చీలో చేరబడ్డాడు. అతని మనస్సిప్పుడు దూదిపింజలా తేలికపడింది. కొడుకులో మార్పువచ్చినందుకు ఆనందించాడు. నిజానికి రాంబాబులో మార్పు రావడానికి కారకులు ఎవరు? తనా...? లేక వాడి స్నేహితులా? ఆలోచించాడు...ఏమిటో ఇదమిత్థమని తేల్చుకోలేకపోయాడు. కాని వీటన్నింటికీ దోహదమిచ్చినవాడు రాజేశ్వర్రావనే లింగమూర్తి అభిప్రాయం. వయసులో చిన్నవాడైనా, రాజేశ్వర్రావు తన కుటుంబానికి ఎంత సహాయం చేశాడు! తన కొడుక్కు పరోక్షంగా వెలుగుబాట చూపించిన ఘనత రాజేశ్వర్రావుకే దక్కాలి — అనుకుంటూ "భగవంతుడు నిన్ను అభివృద్ధిలోకి తీసుకువస్తాడు, నాయనా" అంటూ మనసులోనే దీవించాడు రాజేశ్వర్రావును. కళ్లల్లో ఆనందబాష్పాలు చిమ్ముతూ ఉంటే మునివ్రేళ్లతో తుడుచుకున్నాడు. అతని జీవితంలో అదో సుదినం మరి! ★

# గృహవైద్యం 35

## జంటతుమ్ములు, జమిలి తుమ్ములు

"బృందావనంబందు
మందార తరువుపై అర
విందేక్షణుడు చాల
శృంగారముగ నుండ,
కుందేందు ధవళ శ్రీ
మందాకినీ..... చిలుక....."

"ఉండవయ్యో ఉండు. చాలించు" అని ఒకరు, "ఏమిటయ్యో నేడు ఒకటే కవిత్వం! అందులో యమకం. అందులో ప్రాసం. అందులో త్రాసం.... ఏమిటి విశేషం?" అని మరొకరూ అన్నారు పాటపాడుతున్న అతనిని గురించి.

**శ్రీహరి**

"నా శ్వాసం నిలిచి ఆరుమాసాలయినా, ప్రాసంమాత్రం నన్ను మోసం చేయదు. మాటలంటే మాటలు కావు. తుపాకిమందు ఢాం ఢాం అని ప్రేలినట్లు మాటల వెంట మాటలు వస్తున్నాయి" అన్నాడు పాటపాడే పెద్దమనిషి.

"ఎందుకండీ ఆమాటలు? వట్టి శబ్దజాలం. మాటలు అర్థగర్భితంగా ఉండాలి. అందులోనూ ఐడియా ఉండాలి. ఈ డబడబ మాటలెందుకండీ! మా అబ్బాయి తుమ్ముల శబ్దంకంటేనా? తుమ్ముల వెంట తుమ్ములు! ఉదయం లేచి కూర్చుని, 'ఆచ్ఛి! ఆచ్ఛి!' అని ఆరంభించాడంటే తుపాకిమందు పేలినట్టు జంటతుమ్ములు, జమిలితుమ్ములు, ప్రాసతుమ్ములు, త్రాసతుమ్ములు, టెలెస్కోప్ తుమ్ములు— చెప్పలేమండి......"

• • •

ఇలా వరుసగా తుమ్మేవారున్నారు. పావుగంట, అరగంట తెరిపిలేకుండా తుమ్మేవారున్నారు. ఇలా ఏనాటో ఇన్నాళ్లో, తుమ్ములు తుమ్ముతూ మధ్యమధ్య ముక్కు చీదడం, ఉమ్మివేయడం, మరల తుమ్మడం ఇలా పరంపర. ఇందులో ఒకొక్కప్పుడు రెండు మూడు తుమ్ములు చేరిపోవడం కూడ కద్దు. అప్పుడు నోటినుంచి, ముక్కునుంచి నీరుకారడం కూడా ఉంటుంది. ఈవిధంగా ప్రతిదినం అరగంటసేపు సుప్రభాతం. జంట తుమ్ములు రావడం చాల విచిత్రంగా ఉంటుంది.

ఇలాంటి జంట తుమ్ములకు శరీరంలో సహనశక్తి— సహిష్ణుత తగ్గిపోవడమే కారణం. ఆకాశంలో ఏమబ్బు ముక్క కనిపించినా, కొందరికి జంటతుమ్ములు, గొంతురాపిడి, దగ్గు, ఆయాసం ప్రారంభమవుతాయి. పొద్దున సుఖంగా, ఆరోగ్యంగా ఉన్న మనిషి సాయంత్రానికి విపరీతమైన పడిసెంతో, తలకు ఉన్ని మఫ్లర్ చుట్టుకుని, ముక్కునీదుతూ, దయనీయమైన అవస్థలో ఉంటాడు. రాత్రి తొలిజామున రెండుమూడు పిల్లికూనలు మూలుగుతున్నట్టు, జంత్ర సమ్మేళనము పెట్టినట్టు గొంతులో సవ్వడులు బయలుదేరుతాయి. అర్ధరాత్రికి రెండు ఊపిరితిత్తులూ ఆటుపోట్లలాగ పడుతూ లేస్తాయి. ఉచ్ఛ్వాసం కొద్దిగాను, నిశ్వాసం ఎక్కువగాను ఉంటుంది. ఎంత తగ్గినా కళ్ళె బయట పడదు. శరీరమంతా చెమటపట్టి నీరసించి పోతుంది. ఇలాటప్పుడు ఆ వ్యక్తికి ప్రాణవాయువు తక్కువయి, చేతులు కాళ్ళు చల్లబడడమే కాకుండా, నల్లబడుతాయి. ఈవ్యక్తి రాత్రంతా కూర్చుని ఊపిరికోసం కష్టపడుతాడు. "ఈ కష్టంకన్నా చచ్చినా ఫరవాలేదు" అంటాడుగాని, నోటినుంచి "దేవుడా!" అన్నమాట రాదు. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఆదుర్దాగా ఉంటాడు. భగవంతుడిచ్చిన గాలిని ఎలాటి కంట్రోలు, కోటా, పర్మిట్టు, లైసెన్స్ అనే కట్టుబాటు ఏమీలేక కావలసినంత పీల్చవచ్చు.